క్లుప్తంగా

విద్యార్థినులకు బ్యాగుల అందజేత



విద్యార్థినులతో నాంది ఫౌండేషన్ ప్రతినిధులు

తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 80 మంది విద్యార్థినులకు శుక్రవారం నాంది ఫౌండేషన్ ప్రతినిధులు బ్యాగులు పంపిణీ చేశారు. బాలికా విద్యను ప్రోత్సహించే లక్ష్యంలో భాగంగా ప్రతిరోజూ ఫౌండేషన్‌కు చెందిన ముగ్గురు ఇన్‌స్ట్రక్టర్లు విద్యార్థులకు వివిధ విభాగాలలో శిక్షణ ఇస్తున్నారని ప్రధానోపాధ్యాయురాలు ఎంవీటీ రత్నం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేక అప్పారావు, కీర్తి అనురాధ, ఫౌండేషన్ ఇన్‌స్ట్రక్టర్లు లక్ష్మి, అహల్య, రాజేశ్వరి, అనురాధ, టి.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు



మారికవలస ఆర్‌జీకే కాలనీలో పూజలు చేస్తున్న మహిళలు

మధురవాడ : దుర్గామాత ఉత్సవాలు పలు ప్రాంతాల్లో జరుగుతున్నాయి. మారికవలస ఆర్‌జీకే కాలనీలోని 141 నుంచి 145 బ్లాకుల మధ్య వైఎస్సార్‌సీపీ 5వ వార్డు మహిళా కార్యదర్శి దువ్వి కావ్యరెడ్డి, దువ్వి శ్రీనివాసరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో కనుల పండువగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం కాలనీ వాసులు విశేషంగా తరలి వచ్చి దుర్గమ్మకు పూజలు చేశారు. పలువురు కాలనీ పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



అరసవిల్లి కృష్ణమ్మ

తగరపువలస : భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీకి చెందిన అరసవిల్లి కృష్ణమ్మ అనే వృద్ధురాలు ఈ నెల 23న అదృశ్యమయింది. ఈమె కుమారుడు శ్రీను ఈ మేరకు శుక్రవారం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వినికిడి శక్తి తక్కువగా ఉండే కృష్ణమ్మ తరచూ విజయనగరం కొత్తపేటలో ఉండే పెద్ద కుమార్తె రమణమ్మ ఇంటికి వెళ్తుండేది. ఈ నెల 23న అలాగే వెళ్లిందనుకుని సాయంత్రం శ్రీను సోదరి రమణమ్మకు ఫోన్ చేయగా తల్లి రాలేదని తెలిపింది. దీంతో చుట్టుపక్కల తెలిసిన వారిని వాకబు చేసినా కృష్ణమ్మ జాడ తెలియరాలేదు. భీమిలి స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకుంటున్న 'హిమలింగం.. అమ్మ రూపం'



ఐసుగడ్డలతో రూపొందించిన శివలింగం, అమ్మవారి ప్రతిమలు

ఆనందపురం : వేములవలసలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలలో భాగంగా మంచు గడ్డతో తయారు చేసిన విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. భక్తులు అమ్మవారి విగ్రహంతో పాటు వాటికీ ప్రత్యేక పూజలు చేస్తున్నారు. నీరు నిరంతరం ప్రవహించేటట్టు ఏర్పాటు చేసిన శివలింగం కూడా పలువురిని ఆకట్టుకుంటోంది. శుక్రవారం సుమారు మూడు వేల మందికి అన్నదానం చేశారు.

500 మందికి ఆహార ప్యాకెట్ల పంపిణీ

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రికి చెందిన కాళ్ల దుర్గారావు శుక్రవారం 500 మందికి ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. తమ కుమార్తె ధనలక్ష్మి మొదటి పుట్టినరోజు సందర్భంగా 12 అనాథాశ్రమాలు, రోడ్లపై కనిపించే అభాగ్యులకు వీటిని అందజేశామన్నారు.

సురక్ష క్యాంపులకు విశేష స్పందన

- గణేష్‌నగర్ శిబిరంలో 504 మందికి సేవలు
- పరిశీలించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి



గణేష్‌నగర్ ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో వైద్యం కోసం రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న రోగులు

మధురవాడ: జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాలకు అన్ని వర్గాల నుంచి విశేష స్పందన లభిస్తోంది. మధురవాడ జోన్ జీవీఎంసీ 7వ వార్డు గణేష్ నగర్‌లోని స్వతంత్రనగర్ యూపీహెచ్‌సీ వద్ద రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిబిరానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. శుక్రవారం శిబిరానికి 504మంది హాజరై పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో అవసరమైన వారికి కళ్లద్దాలు, మందులను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఉచితంగా అందజేశారు. ఈ క్యాంపు ద్వారా అవసరమైన వారికి ఉన్నత వైద్యం కూడా ఆరోగ్య శ్రీ ద్వారా అందిస్తారని, ఈ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఏవీ సుధారెడ్డి, కె.మహాలక్ష్మి, జి.సాగరిక, అజయ్, రజిత తదితర వైద్య నిపుణులు ఇక్కడ సేవలు అందించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, కల్చరల్ వింగ్ రీజనల్ కో–ఆర్డినేటర్ వంకాయల మారుతీప్రసాద్, 5వ వార్డు జేసీఎస్ కన్వీనర్లు పోతిన సురేష్, కుడితి రామారావు, రైల్వే బోర్డు సభ్యుడు ఎస్. బాబ్జి, మహిళా అధ్యక్షురాలు బండారు శివలక్ష్మి, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

బొగ్గురోడ్డు–1 సచివాలయ పరిధిలో 474 మందికి..

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బొగ్గురోడ్డు–1 వార్డు సచివాలయం పరిధిలోని లబ్ధిదారుల కోసం శుక్రవారం చిట్టివలస జ్యూట్ మిల్లు కల్యాణమండపంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన కనిపించింది. ఈ శిబిరంలో 474 మందికి వైద్యులు తనిఖీ చేసి మందులు, కేస్ షీట్లు అందించారు. 92 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా.. 52 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. ఈ సందర్భంగా జెడ్పీ బి.రాము మాట్లాడుతూ జోన్‌లోని వార్డు సచివాలయాల వారీగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జీరు వెంకటరెడ్డి, కొప్పల రమేష్, వెంపాడ వెంకటరమణ, చింతగుంట శివ, అక్కరమాని గంగాధర్, పందిరి విజయ్ తదితరులు సేవలు అందించారు.

పీఎం పాలెం యూపీహెచ్‌సీలో 518 మందికి..

పీఎం పాలెం: పీఎం పాలెం యూపీహెచ్‌సీలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. శిబిరంలో 518 మందికి ఉచిత వైద్య సేవలు అందించగా.. అందులో 316మంది మహిళలున్నారు. 82 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి బీపీ, షుగర్, వంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్థానిక వైద్యాధికారి పి.సౌజన్య, డాక్టర్లు పి.దుర్గాసాయి, ఎం.కీర్తి, శ్రీనివాస్ సందీప్, శాంతి కిరణ్‌లను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గాదె రోశిరెడ్డి, నరసింగరావు, పోతిన సూరిబాబు, శివకుమార్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష నేడు

తగరపువలస: భీమిలి జోన్ నమ్మివానిపేట వార్డు సచివాలయం పరిధిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఉదయం 9 గంటల నుంచి 5 వరకు స్థానిక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద జరుగుతుందని జెడ్పీ బి.రాము తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పీఎం పాలెం యూపీహెచ్‌సీలోని శిబిరంలో డాక్టర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి



గణేష్‌నగర్ సురక్ష క్యాంప్‌లో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు



చిట్టివలస శిబిరంలో లబ్ధిదారులకు మందులు అందిస్తున్న జెడ్పీ రాము



బొగ్గురోడ్డు–1 సచివాలయ పరిధిలో ప్రజలకు మందులు పంపిణీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

సామాజిక సాధికార బస్సు యాత్రకు ఏర్పాట్లు



చిట్టివలస బంతాట మైదానంలో బహిరంగ సభ కోసం నిర్మిస్తున్న వేదిక



బహిరంగ సభ ప్రదేశాన్ని భీమిలి సీఐ రమేష్‌తో కలిసి పరిశీలిస్తున్న ఏసీపీ శివరామిరెడ్డి

- చిట్టివలస బంతాట మైదానంలో బహిరంగ సభ నేడు
- ఇప్పటికే పూర్తయిన ఏర్పాట్లు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికారత బస్సు యాత్రలో భాగంగా శనివారం మధ్యాహ్నం చిట్టివలస బంతాట మైదానంలో బహిరంగ సభ జరగనుంది. ఈ యాత్రలో భాగంగా ఎండాడలోని వైఎసార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రులు, ఇతర మంత్రులు మీడియా సమావేశంలో పాల్గొననున్నారు. అనంతరం యాత్రలో పాల్గొన్న మంత్రుల బృందం చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు బోయిపాలెం కూడలి నుంచి ద్విచక్ర వాహనాల ర్యాలీ ప్రారంభమై తగరపువలస వరకు సాగుతుంది. చివరగా చిట్టివలస బంతాట మైదానంలో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే బహిరంగ సభకు జీవీఎంసీ, భీమిలి నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కానున్నారు. బహిరంగ సభకు 30 వేల మంది వరకు హాజరుకానున్నట్టు అంచనా వేశారు. ప్రజల సౌకర్యార్థం 16 వేల కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు.

బస్సు యాత్ర విజయవంతానికి కృషి

వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికారత బస్సు యాత్ర విజయవంతానికి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డితో గురు, శుక్రవారాల్లో బహిరంగ సభ ప్రదేశాన్ని పరిశీలించారు. మరోవైపు శుక్రవారం మధురవాడ జోన్ ఏసీపీ ఎం.శివరామిరెడ్డి, భీమిలి సీఐ డి.రమేష్ చిట్టివలస బంతాట మైదానాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భద్రతకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలని ప్రజల ఆకాంక్ష



ఆనందపురం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి



పద్మనాభంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ఆనందపురం : సంక్షేమం, అభివృద్ధితో అందరికీ మేలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డే మరలా ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఆనందపురంలో శుక్రవారం ఆయన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రులు, ఎమ్మెల్యేలతో కూడిన బస్సు యాత్ర శనివారం మధ్యాహ్నానికి తగరపువలస చేరుకుంటుందన్నారు. ఈ సందర్భంగా అక్కడ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు సంపూర్ణ న్యాయం జరిగిందని తెలిపారు. టీడీపీ పాలనలో అన్ని వర్గాలు మోసపోయాయని, ఆ విషయాలు సభలో వెల్లడిస్తామని పేర్కొన్నారు. చంద్రబాబు అవినీతి బయటపడడంతోనే ఆయన జైలుకు వెళ్లారన్నారు. సినిమాలు వేరు రాజకీయాలు వేరని, సీఎం అవుదామని పార్టీ పెట్టిన పవన్ కల్యాణ్ ఇప్పుడు టీడీపీతో బేరసారాలు సాగిస్తున్నారన్నారు. అలాంటి వ్యక్తి ఎలా ముఖ్యమంత్రి అవుతారని ప్రశ్నించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, భీమిలి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, కన్వీనర్ల మండల ఇన్‌చార్జి గంధ్రెడ్డి శ్రీనివాస్, నాయకులు కోరాడ అప్పలస్వామి నాయుడు, కోరాడ వెంకట రమణారావు, కాకర వెంకట రమణ, షిణగం అప్పలరాజు, పడాల రాము, ఉప్పాడ లక్ష్మణరావు, కర్రి నాయుడుబాబు, విజినిగిరి అప్పలనాయుడు, ఇలిపిల్లి నరిసింగరావు పాల్గొన్నారు.

బస్సు యాత్రకు తరలి రావాలి..

పద్మనాభం : సామాజిక సాధికారక బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. పద్మనాభంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు బస్సు యాత్ర తగరపువలస చేరుకుంటుందన్నారు. ఓటర్లను ఓడిగే హక్కు ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే ఉందన్నారు. రాష్ట్రంలో 31 లక్షల మందికి జగనన్న ఇళ్లు మంజూరు చేసి ఆయన చరిత్రకెక్కారన్నారు. పద్మనాభం మండలంలో 16 సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో సంక్షేమానికి రూ. 245 కోట్లు, అభివృద్ధికి రూ.120 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, నాయకులు తాలాడ పద్మనాభం, ఈర్ల ఈశ్వరరావు, బోని సన్యాసినాయుడు, కె.రమణ, అముజూరి అప్పారావు, జి.పెద ఎర్రినాయుడు, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

బంగ్లామెట్ట పాఠశాలను సందర్శించిన ఎంఈవో



బంగ్లామెట్ట పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంఈవో శివరాణి

తగరపువలస: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భీమిలి ఎంఈవో ఎం.శివరాణి కోరారు. ఆమె శుక్రవారం ఒకటోవార్డు బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల పుస్తకాలను తనిఖీ చేసి, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థుల నోట్ బుక్స్, వర్క్ పుస్తకాలు తరచూ దిద్దాలని సూచించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. నాడు–నేడు పథకంలో భాగంగా పాఠశాలకు అందించిన ఫర్నిచర్, ఆర్వో వాటర్ ప్లాంట్, స్మార్ట్ టీవీని పరిశీలించారు. విద్యాకానుకల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకుని, మధ్యాహ్న భోజనం రుచి చూశారు. ప్రతి విద్యార్థి విధిగా పాఠశాలలోనే భోజనం చేయాలని సూచించారు. బోధనాభ్యసన సామగ్రి, ఉపాధ్యాయుల డైరీ పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, పిన్నింటి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి యువకుడి దుర్మరణం



ప్రమాదానికి కారణమైన ఆటో



మృతి చెందిన అప్పలరాజు

ఆనందపురం : మండలంలోని చందక గ్రామం శివారున శుక్రవారం రాత్రి ఆటో బోల్తా పడిన ఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ రామచంద్రరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పద్మనాభం మండలం ఏనుగుల పాలెం గ్రామానికి చెందిన పట్నాల అప్పలరాజు (41)తో పాటు ప్రైవేటు పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఆటోలో గొట్టిపల్లి నుంచి చందక గ్రామానికి వెళ్తున్నారు. ఆ ఆటో చందక గ్రామం శివారుకు చేరుకునే సరికి కుక్క అడ్డంగా రావడంతో ఆటో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న అప్పలరాజు ముందు రోడ్డు పైకి తుళ్లిపడగా అతనిపై ఆటో పడిపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అప్పలరాజు సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మిగతా వారికి ఎటువంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న సీఐ రామచంద్రరావు, ట్రాఫిక్ ఎస్ఐ రఘురామ్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించి ఆటో డ్రైవర్ రమేష్‌ని అదుపులోకి తీసుకున్నారు. పట్నాల చిరంజీవి, లక్ష్మిలకు అప్పలరాజు ఏకైక కుమారుడు. అతనికి భార్య వెంకటలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పోయిన సెల్‌ఫోన్ 10 నిమిషాల్లో గుర్తింపు



మహిళకు సెల్‌ఫోన్ అప్పగిస్తున్న క్రైం ఎస్ఐ సూర్యప్రకాశ్

భీమునిపట్నం: భీమిలిలోని ఓ మహిళ శుక్రవారం తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా.. క్రైం ఎస్ఐ సూర్యప్రకాశ్ పది నిమిషాల్లోనే దాన్ని కనిపెట్టి ఆమెకు అందించారు. వివరాలివి.. గరికిన కనక అనే మహిళ మెయిన్ రోడ్డులోని గంటస్తంభం సమీపంలో పని మీద వచ్చారు. అక్కడ పని చూసుకుంటున్న క్రమంలో తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నారు. ఆమె వెంటనే క్రైం పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సూర్యప్రకాశ్‌కు ఫిర్యాదు చేయగా, ఆయన వెంటనే తన వద్దనున్న ప్రత్యేక యాప్ ద్వారా ఫోన్ ఉన్న ప్రదేశాన్ని పరిశీలించగా.. అది గంటస్తంభం పరిసరాల్లో ఉన్నట్టు తెలిసింది. వెంటనే ఆయన అక్కడికి వెళ్లి పరిశీలించగా.. రోడ్డు పక్కన చిన్న పిచ్చిమొక్కలో ఉండడాన్ని కనుగొన్నారు. ఆ ఫోన్‌ను తీసుకువచ్చి కనకకు అందించడంతో ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఫిర్యాదు అందుకున్న పది నిమిషాల్లోనే ఫోన్‌ను కనిపెట్టి అందించడంతో ఎస్ఐను పలువురు ప్రశంసించారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న అర్చకులు

కొమ్మాది : రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రం, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకెళ్ళి అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

విశాఖ వెటరన్ అథ్లెట్ మీట్ రేపు

మురళీనగర్: విశాఖ జిల్లా వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని పోలీస్ బ్యారెక్స్ మైదానంలో ఆదివారం వెటరన్ అథ్లెటిక్స్ మీట్ పోటీలు నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కె.బాబూరావు, మంగా వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రన్నింగ్ 100 మీ., 200 మీ., 400 మీ., 800 మీ., 1500 మీ., 5000 మీ., వాకింగ్ 5 కి.మీ, లాంగ్ జంప్, ట్రిపుట్ జంప్, షాట్‌పుట్, జావిలిన్ త్రో, డిస్కత్రో, హేమర్ త్రో వంటి క్రీడల్లో పోటీలు జరుగుతాయన్నారు. 30 ఏళ్లు దాటిన వారందరూ పాల్గొనవచ్చని, వయసుల వారీగా విభజించి పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. క్రీడాకారులు వారి పుట్టిన తేదీ సర్టిఫికెట్‌తో రావాల్సి ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో మొదటి రెండు స్థానాలు సాధించిన వారిని నవంబర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. పాల్గొన్న వారికి స్నాక్స్, మధ్యాహ్న భోజనం అందిస్తామని తెలిపారు. వివరాలకు 97013 47311, 98666 68966, 83091 57522, 92474 24395 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

దుర్గాలమ్మ సన్నిధిలో అన్నసమారాధన



చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయం వద్ద అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మధురవాడ: శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా చంద్రంపాలెం జాతర గట్టు శ్రీ దుర్గాలమ్మ ఆలయం ప్రాంగణంలో శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. మిథిలాపురి వుడా కాలనీకి చెందిన జై భవానీ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన జేవీవీ శ్రీనివాసరావు, జమున దంపతుల సహకారంతో చేపట్టిన కార్యక్రమంలో సుమారు 4వేల మందికి అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయం ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, కమిటీ ప్రతినిధులు, సింహాచలం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, జగ్గుపిల్లి నరేష్ తదితరులు కార్యక్రమాన్ని ప్రారంభించి, భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు.

యువకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్



యువకులను కాపాడిన లైఫ్ గార్డ్స్

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో మునిగిపోతున్న ఇద్దరు యువకులను లైఫ్ గార్డ్స్ కాపాడారు. విజయనగరానికి చెందిన 9 మంది యువకులు శుక్రవారం సాయంత్రం సరదాగా గడిపేందుకు ఇక్కడ బీచ్‌కు వచ్చారు. కాసేపు సరదాగా గడిపి స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండడంతో వారిలో కె.సాయి, ఇ.జశ్వంత్ మునిగిపోతుండగా గమనించిన లైఫ్‌గార్డ్స్ చందు, సూరాడ నూకరాజు, సతీష్ సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. మెరైన్ పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

పోలీసు విధులపై విద్యార్థులకు అవగాహన



ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

పద్మనాభం: పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పద్మనాభం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఎస్.సన్యాసినాయుడు పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీసుల విధుల గురించి వివరించారు. ఆయుధాల వినియోగం, ఫిర్యాదుల స్వీకరణపై అవగాహన కల్పించారు.

భారతీయ సంస్కృతిని అర్థం చేసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న విదేశీ విద్యార్థినులు

కొమ్మాది: వివిధ దేశాల నుంచి వచ్చి గీతంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను అర్థం చేసుకోవాలని గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ సూచించారు. విద్యార్థులతో సాంస్కృతిక సంబంధాలను పెంచుకోవడం ద్వారా ఉన్నత వ్యక్తిత్వంతో పట్టభద్రులుగా తమ దేశాలకు వెళ్లాలని ఆకాంక్షించారు. గీతంలో నూతనంగా ప్రవేశం పొందిన విదేశీ విద్యార్థులకు అంతర్జాతీయ విద్యార్థి విభాగం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంకితభావం, కష్టపడే గుణం ఉంటే ఉన్నత విద్యలో ఉత్తమ ఫలితాలను సాధించవచ్చన్నారు.

బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడిగా 'దోని'



నియామకపత్రం అందుకుంటున్న నాగరాజు

కొమ్మాది: భారతీయ జనతాపార్టీ యువమోర్చా విశాఖ జిల్లా అధ్యక్షుడిగా జీవీఎంసీ 4వ వార్డుకు చెందిన దోని నాగరాజు నియమితులయ్యారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర రెడ్డి నాగరాజుకు శుక్రవారం నియామకపత్రం అందజేశారు.